క్లుప్తంగా

జిల్లాస్థాయి అవార్డుకు 'మోడల్' ఉపాధ్యాయిని


ఉపాధ్యాయురాలు కృష్ణవేణి

మక్కువ: మండలంలోని ములక్కాయవలస ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయిని కృష్ణవేణి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల్లో తమ పాఠశాలకు చెందిన కృష్ణవేణి ఎంపికకావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని కృష్ణవేణిని ప్రిన్సిపాల్‌తో పాటు సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

అగ్నిమాపక కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎఫ్ఓ


డ్రిల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు

సాలూరు: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది డ్రిల్, లీడర్ డ్రిల్, పికింగ్అప్ డ్రిల్ పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అందరూ నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధిపై శిక్షణ


మాట్లాడుతున్న ఐబీ ఏపీఎం జయమ్మ

బలిజిపేట: మహిళా సంఘాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరమని ఏపీఎం జయమ్మ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం భవనంలో వీఓఏలకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే చిన్న,చిన్న సంఘాలను బలోపేతం చేయడం, దాని ద్వారా గ్రామ ఐక్య సంఘాలు, మండల సమాఖ్య బలోపేతం, అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అందుకు గాను మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలతో మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు


గోతులు పూడ్చిస్తున్న ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిలో సువర్ణముఖి నదిపై వంతెన వద్ద ఏర్పడిన గోతులను ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో సోమవారం పూడ్చివేసే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రహదారిలో వంతెనవద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గోతుల మయం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశరు. అపరిచితులు వాహనాలతో రాకపోకలు చేయడం వల్ల గోతిని పరిశీలించక ముందే బైక్‌లు అందులో పడి బోల్తాకొట్టే ప్రమాదముందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సిబ్బంది సహకారంతో గోతులను పూడ్చివేయించినట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం

- డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర
- దబ్బగెడ్డ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, గతంలో ఏపాలకులూ చేయలేనన్ని, సాధ్యం కాని సంక్షేమపథకాలను ప్రజలకోసం అందిస్తున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ దబ్బగెడ్డ, విజయరామపురం గ్రామాలలో ఎంపీడీవో సీహెచ్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు మహిళలు ఘన స్వాగతం పలికి, గజమాలలతో సత్కరించి, దుశ్శాలువాలతో సన్మానించారు.

గడపగడపకూ సంక్షేమం

అనంతరం గ్రామంలో పర్యటించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రతి ఇంటికి వెళ్లి గ్రామస్తులను కలుసుకుని ప్రభుత్వ ద్వారా సంక్షేమపథకాలు అందుకున్న లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేసి వివరించారు. పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను ఈ సందర్భంగా రాజన్నదొర వివరిస్తూ, సంక్షేమ పథకాలు పొందలేకపోయిన అర్హులైన లబ్ధిదారులను గుర్తించారు. గ్రామంలో సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరగా, పోడు పట్టాలు అందించాలని, ఇళ్లు మంజూరు చేయాలని, పీఎం కిసాన్ అందడంలేదని ప్రజలు తెలపగా, సంబంధితశాఖ అధికారులతో అక్కడే మాట్లాడి పథకాలు అందకపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారు.

79 సచివాలయాల్లో కార్యక్రమం

సాలూరు నియోజకవర్గంలో మక్కువ, సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాల్లో ఇంతవరకు 79 సచివాలయాల పరిధిలో 186రోజుల పాటు గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామని ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ఈ సందర్భంగా తెలిపారు.

అవ్వాతాతలతో ముచ్చట్లు

దబ్బగెడ్డ గ్రామంలో అవ్వా, తాతలతో డిప్యూటీ సీఎం రాజన్నదొర ముచ్చటించారు. జగన్‌మోహన్ రెడ్డి ఏవిధంగా పాలన సాగిస్తున్నారని వారిని అడగా, ప్రతినెలా 1వతేదీ తెల్లవారుజామునే ఇంటికి వలంటీర్లు వచ్చి, పింఛన్ అందిస్తున్నారని వారు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సీదరపు లక్ష్మి, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, అధికారులు, వైఎస్సాఆర్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

సెకెండ్ ఫేజ్‌లో 18 గ్రామాల్లో రీ సర్వే పూర్తి


మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: జగనన్న 'భూ' హక్కు, 'భూరక్ష రీ సర్వే కార్యక్రమంలో భాగంగా సెకెండ్ ఫేజ్‌లో ఆర్ఓఆర్ సర్వే పనులు నెలాఖరునాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన 'రీ' సర్వే పనులపై నిర్దేశించిన వీఆర్వోలతో కార్యాలయంలో రీ సర్వే డీటీ చిట్టెమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సెకెండ్ ఫేజ్‌లో రీ సర్వే పూర్తిచేసిన 18 స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటికి 6 గ్రామాల్లో పూర్తయిందన్నారు. మరో 6 గ్రామాల్లో ఈనె 25 నాటికి స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే వీఆర్వోలు, సిబ్బంది సహకారంతో పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామని తెలియజేశారు.

'పీఎం కిసాన్ లబ్ధికి ఆన్‌లైన్..

మండలంలోని రైతులకు సంబంధించి పీఎం కిసాన్ పథకం అమలుకు ఆన్‌లైన్ వేగవంతం చేయడానికి పనులు చురుగ్గా జరుగుతున్నాయని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి రైతుల నుంచి 320 దరఖాస్తులు వచ్చాయని వారందరికీ పీఎం కిసాన్ పథకం లబ్ధి చూకూరేందుకు ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు


కాలువలో పిచ్చిమొక్కలు తీస్తున్న రైతులు

సీతానగరం: మండలంలోని కొత్తవలస వద్ద ఉన్న సీతానగరం ప్రాజెక్ట్ కుడి కాలువలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను చినభోగిలి వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతులు సోమవారం స్వచ్ఛందంగా తొలగించారు. ఈ మేరకు ఆయకట్టు భూములకు సాగునీరు సరఫరా అయ్యేలా పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు మాట్లాడుతూ సువర్ణముఖి నదికి ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో విస్తారంగా నీరు చేరడం వల్ల కాలువ దిగువ ఆయకట్టు చెరువులకు సాగునీరు మళ్లించడానికి కాలువ పనులను చేపట్టినట్లు తెలిపారు. బల్లకృష్ణాపురం నుంచి చినభోగిలి వరకూ సీతానగరం సాగునీరు ప్రాజెక్ట్ కుడికాలువలో పిచ్చి మొక్కలు పేరుకు పోవడంతో నీటి ప్రవాహంలో ఇబ్బందులు వచ్చాయి. ఈ క్రమంలో ఆయకట్టు భూములున్న రైతులు మూకుమ్మడిగా పిచ్చిమొక్కలు తొలగించే పనులు స్వచ్ఛందంగా చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంట శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాలి

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురం టౌన్: చిన్నారుల వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు పిల్లల వ్యాధులపై వైద్యాధికారులు, నర్సులకు ఫోర్‌డీ వ్యాధులు, చికిత్స, రిఫరల్, శస్త్రచికిత్సలు తదితర విషయాలపై శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక అశ్రద్ధ చేసే పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. పుట్టినప్పటి నుంచి కనీసం ఐదేళ్ల వరకు పిల్లల ఆరోగ్యంపై దృష్టిపెట్టడం వల్ల జీవితంలో అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెప్పారు. సామాజిక సేవల్లో భాగంగా వైద్యసిబ్బంది ఆరోగ్యవంతమైన జిల్లాగా రూపొందించడంలో ప్రముఖ పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎల్.భరత్‌చంద్ర, ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి డాక్టర్ ధవళభాస్కర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, ఎపిడిమాలజిస్టు ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా తోటపల్లి కుడికాలువ


ప్రవహిస్తున్న తోటపల్లి కుడి కాలువ నీరు

సీతానగరం: మండలంలోని బుడ్డి మీదుగా తోటపల్లి సాగునీటి ప్రాజెక్ట్ కుడి కాలువ ద్వారా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తోటపల్లి కాలువ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉభాలు పూర్తి కావస్తున్నందున నీరు అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు సోమవారం సాయంత్రం నీరు విడుదల చేయడంతో ప్రవహిస్తోంది.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

సాలూరు: ప్రజల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎన్‌వైనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటిన ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. పట్టణాల్లోనూ ఉపాధి హామీ పథకం అమలు చేసి పట్టణ పేదలకు పనికల్పించాలని కోరారు. ప్రజాసమస్యలు పరిష్కరించుకుంటే భవిష్యత్‌లో చేపట్టే ఆందోళనలు, పోరాటాలకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

నీతి, నిజాయితీకి మారుపేరు రాజన్నదొర

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజ్ననదొర నీతి, నిజాయితీకి మారుపేరని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప ప్రకాశరావు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సాలూరులో మాట్లాడుతూ, రాజన్నదొరపై టీడీపీ ఎస్టీ సెల్ నాయకుడు దారునాయక్ తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. జీసీసీలో ఉద్యోగిగా పనిచేసిన నాటినుంచి నేటివరకు అవినీతికి ఆమడ దూరంలో రాజన్నదొర ఉంటూ, నీతి నిజాయితీలకు మారుపేరుగా నిలిచారని పేర్కొన్నారు. గిరిజనులకు అండగా రాజన్నదొర నిలుసున్నారని, ఆయనపై ఇంకోసారి ఇటువంటి తప్పుడు ప్రకటనలు చేసే సహించేది లేదని హెచ్చరించారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- డీఐఓ జగన్మోహనరావు


పదమాయవలసలో చిన్నారిని పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

బలిజిపేట: చిన్నారుల ఆరోగ్యంపట్ల వైద్యశాఖ, తల్లితండ్రులు శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) జగన్మోహనరావు కోరారు. ఈ మేరకు మండలంలోని అరసాడ పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా పర్యవేక్షించారు. పీహెచ్‌సీలో ఓపీ నిర్వహణ, మందులు, వ్యాక్సిన్ నిల్వలు, ల్యాబ్, ప్రసూతిగది, వార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సీజనల్ రోగాలకు అవసరమైన మందులు, పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్ నిల్వలను తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అవసరమైన సేవలను అందించాలని కోరారు. అనంతరం పదమాయవలస గ్రామంలో గృహ సందర్శన చేశారు. చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేసిందీ? లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఎం.శివగాయత్రి, ఈఓ నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


పెద్దవీధిలో కుళాయి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని పెద్దవీధి ప్రాంతంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో హామీ ఇచ్చిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు అక్కడి ప్రజలు సహకరించని విషయాన్ని తెలుసుకుందామని వెళ్లారు. అక్కడ సమస్య తీర్చేందుకు రోడ్డు వేస్తే మధ్యలో కుళాయిలు పోతాయన్న ఆపోహతో ప్రజలు నిర్మాణానికి సహకరించడం లేదని తెలుసుకున్నారు. అక్కడున్న ప్రజలకు కుళాయి పైప్‌లైన్ వేసి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా తమ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించి మరింత అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై స్పందించిన ఎమ్మెల్యే

ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు కనబరుస్తున్న నిర్లక్ష్యంపై స్పందించిన ఎమ్మెల్యే జోగారావు సోమవారం నియోజకవర్గంలో పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయం

సీతానగరం: మండలంలోని వివిధగ్రామాల్లో ఉన్న ఎరువుల విక్రయ కేంద్రాల్లోని ఎరువులు వ్యవసాయ శాఖ అనుమతితో నిర్దేశించిన ధరకు రైతులకు విక్రయిస్తారని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పెదభోగిలి వరిచేను పొలం గట్లపై రైతులు కంది విత్తనాలు నాటే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిచేను మడుల గట్లపై కందిపంట వేయడం వల్ల ఫలసాయం వస్తుందని, పచ్చిక మొలకెత్తడాన్ని తగ్గిస్తుందని చెప్పారు. రైతులు పొలం గట్లపై వ్యవసాయ సహాయకుల సూచనల మేరకు కందిపంట వేసుకోవాలని సూచించారు. ఎరువుల భ్యతపై మాట్లాడుతూ మండలంలో రైతులు ఖరీఫ్ పంట సాగుచేస్తున్న భూములకు అవసరమైన ఎరువుల నిల్వలున్నాయని ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

17.000 ఎకరాల్లో వరి సాగు

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు 17,000ఎకరాల్లో వరిసాగు చేపట్టారని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. రైతుల పంటలను ఈ క్రాప్ నమోదు చేస్తామన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేత

బలిజిపేట: మండలంలోని పలగర గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారు రాములమ్మ విశాఖలో గల మారికవలస హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా వలంటీర్ కూర్మారావు అక్కడికి సోమవారం వెళ్లి ఆస్పత్రిలో ఆమెకు పింఛన్ అందజేశాడు. అదేవిధంగా బలిజిపేటకు చెందిన వి.సత్తిరాజు విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ కల్యాణి అక్కడికి కూడా వెళ్లి పింఛన్ అందజేసింది. వలంటీర్ల సేవాదృక్పథాన్ని గుర్తించిన ఆయా గ్రామాలకు చెందిన గ్రామస్తులు, లబ్ధిదారుల బంధువులు సంతృప్తి వ్యక్తం చేశారు.


సీతానగరం: విజయనగరంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ కల్యాణి


బలిజిపేట: జిల్లా కేంద్రాస్పత్రిలో పెంటయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్, పీఏసీఎస్ చైర్మన్ కూర్మారావు

కొత్త పింఛన్ పంపిణీ

సీతానగరం: అనారోగ్యంతో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న సీతానగరం మండలంలోని పెదభోగిలి గ్రామానికి చెందిన కొత్త పింఛన్ దారు గంటా పెంటయ్యకు వలంటీర్ తరణి ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ కూర్మారావు, సచివాలయ కన్వీనర్ కిరణ్‌కుమార్ సోమవారం కొత్త పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారు పెంటయ్య మాట్లాడుతూ అనారోగ్యానికి గురై పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో కష్టాల్లో ఉన్న తనను పరామర్శించి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్ అందజేసిన నాయకులు, గ్రామవలంటీర్‌కు ధన్యవాదాలు తెలియజేశాడు, పింఛన్ దారులు ఎక్కడ ఉన్నా నిర్దేశించిన సమయంలో జగనన్న పింఛన్ కానుక పంపిణీ చేస్తామని వలంటీర్ తరణి ఈ సందర్భంగా అన్నారు.


సీతానగరం: విశాఖలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ కూర్మారావు